
నమస్తే తెలంగాణ
# మెదక్
13 | హైదరాబాద్, గురువారం 18 జనవరి 2024 | MEDAK


## మెదక్ నుంచి వరుసగా ఐదు సార్లు...
## జహీరాబాద్ నుంచి రెండు సార్లు బీఆర్ఎస్ గెలుపు..

ఉమ్మడి మెదక్ జిల్లాలో మెదక్, జహీరాబాద్ రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. మెదక్ నుంచి వరుసగా ఐదు సార్లు...జహీరాబాద్ నుంచి వరుసగా రెండు సార్లు బీఆర్ఎస్ గెలిచింది. మెదక్ లోక సభ పరిధిలోకి సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి శాసనసభ నియోజకవర్గాలు వస్తాయి. బీఆర్ఎస్ నుంచి 2004-09 వరకు ఆలే నరేంద్ర, 2009-14వరకు విజయశాంతి, 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గజ్వేల్ శాసనసభ స్థానానికి, మెదక్ పార్లమెంట్ స్థానానికి రెండింటికీ పోటీ చేసి భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో మెదక్ పార్లమెంట్ స్థానానికి కేసీఆర్ రాజీనామా చేశారు. దీంతో వచ్చిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా కొత్త ప్రభాకర్‌రెడ్డి పోటీ చేసి ఘన విజయం సాధించారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సైతం కొత్త ప్రభాకర్‌రెడ్డి మెజార్టీతో విజయం సాధించారు. వరుసగా మెదక్ నుంచి బీఆర్ఎస్ ఐదు సార్లు ఘన విజయం సాధించింది. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక మెదక్ మినహా అన్ని శాసనసభ స్థానాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక జిల్లాలోని రెండో పార్లమెంట్ నియోజకవర్గమైన జహీరాబాద్ పరిధిలో జహీరాబాద్, ఆందోల్, నారాయణ్‌ఖేడ్, కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, బాన్స్‌వాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి శాసనసభ నియోజకవర్గాలు వస్తాయి. 2014-2019, 2019 ఎన్నికల్లో రెండు సార్లు బీఆర్ఎస్ అభ్యర్థిగా బీబీ పాటిల్ ఘన విజయం సాధించి ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్నారు. ఈ సారి ఎన్నికల్లో మూడో సారి గెలుపొంది హ్యాట్రిక్ కొట్టేలా బీఆర్ఎస్ ఎన్నికలకు సన్నద్ధమవుతుంది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గంలోని జుక్కల్, ఎల్లారెడ్డి, ఆందోల్, నారాయణ్‌ఖేడ్‌లో (కాంగ్రెస్), కామారెడ్డి( బీజేపీ), బాన్స్‌వాడ, జహీరాబాద్‌లో ( బీఆర్ఎస్) పార్టీ ఎమ్మెల్యేలు గెలుపొందారు.



## బీఆర్ఎస్‌కు విజయాలు అందించిన గడ్డ

బీఆర్ఎస్ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు అనేక విజయాలను అందించింది మెతుకు గడ్డ. తెలంగాణ వచ్చిన తర్వాత 2014, 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఆధిక్యతను కనబర్చింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 10 శాసనసభ స్థానాలకు 2014లో 8 స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకోగా, జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది. నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే అనారోగ్య కారణంతో మరణించగా అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. 2016లో జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి గెలుపొందారు. దీంతో 10కి తొమ్మిది చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక 2018 ఎన్నికల ఫలితాల్లో 10 శాసనసభ స్థానాలకు తొమ్మిది చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఒక్క సంగారెడ్డిలో మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. తదనంతరం దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అనారోగ్య సమస్యల కారణంగా మృతి చెందడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. 2020లో ఉప ఎన్నిక జరిగింది. ఈ ఉప ఎన్నికల్లో స్వల్ప ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ ఓడిపోయింది. కాగా ఈ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు 1,079 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అంతకుముందు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడు జిల్లా పరిషత్‌లను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. అన్ని మండల పరిషత్‌లతో పాటు, గ్రామాల సర్పంచ్‌లు ఇలా అన్నింటా బీఆర్ఎస్ నిలిచింది. జిల్లాలో 95 శాతానికి పైగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఉన్నారు. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పది శాసనసభ స్థానాలకు ఏడు చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ మూడు చోట్ల విజయం సాధించింది. 2014, 2018, 2023 శాసనసభ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ విజయాన్ని సొంతం చేసుకుంది. 2014లో రెండు, 2018లో ఒక స్థానం, 2023లో మూడు స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది. ప్రతి ఎన్నికల ఫలితాలను బట్టి చూస్తే ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట అని చెప్పవచ్చు.



ఇటీవల
- జహీరాబాద్ లోక్‌సభ సమీక్ష పూర్తి
- రేపు తెలంగాణ భవన్‌లో మెదక్ పార్లమెంట్ సమీక్షా సమావేశం
- పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ నుంచి వరుసగా ఐదు సార్లు...
- జహీరాబాద్ నుంచి వరుసగా రెండు సార్లు గెలిచిన బీఆర్ఎస్
- ఎన్నికలు ఏవైనా జిల్లా ప్రజలు కేసీఆర్, బీఆర్ఎస్ వెంటే..
- శాసనసభ నియోజకవర్గాల్లో కృతజ్ఞతా సభలు
- నేడు గజ్వేల్ శాసనసభ నియోజకవర్గం కృతజ్ఞతా సభ
- కృతజ్ఞతా సభలు, పార్టీ సమీక్షా సమావేశాలతో పార్టీ క్యాడర్‌లో నూతన ఉత్తేజం




# సార్వత్రిక ఎన్నికలకు.. సమాయత్తం

**బీఆర్ఎస్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు**





సిద్దిపేట, జనవరి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో నియోజక వర్గాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ క్యాడర్‌ను పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలా పని చేయాలి అని పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. దీంతో క్యాడర్‌లో నూతన ఉత్తేజం వస్తుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో మెదక్ పార్లమెంట్ స్థానంతోపాటు జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ సన్నాహక సమావేశాల్లో భాగంగా జహీరాబాద్ నియోజకవర్గ సమావేశం ఇటీవల ముగిసింది. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షా సమావేశం శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావడంతో అధిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేక పవనాలు వీచినప్పటికీ ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ తన సత్తా చాటుకుంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రెండు స్థానాలకు రెండు భారీ మెజార్టీతో గెలిపించుకొని మరో సారి సత్తాచాటేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతుంది. ఇటీవల శాసనసభ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ కృతజ్ఞతా సభలు నిర్వహించి మాజీ మంత్రి హరీశ్‌రావు పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్, మెదక్, దుబ్బాక నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పార్టీ కృతజ్ఞతా సభలు నిర్వహించారు. నేడు (గురువారం) గజ్వేల్ శాసనసభ నియోజకవర్గం కృతజ్ఞతా సభను గజ్వేల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరుకానున్నారు. త్వరలోనే మిగతా నియోజకవర్గాల్లో కృతజ్ఞతా సభలు ఏర్పాటు చేసి పార్టీ క్యాడర్‌ను పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం చేయనున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను అమలు చేయడంలో విఫలమవుతున్న విషయాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్లి కాంగ్రెస్ విధానాలను ఎండగట్టేలా పక్కా ప్రణాళికతో బీఆర్ఎస్ ముందుకు కదులుతుంది.



# సద్దుమణిగిన అవిశ్వాసం

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసిన మున్సిపల్ కౌన్సిలర్లు
- తనదైన శైలిలో చక్రం తిప్పిన పల్లా

చేర్యాల, జనవరి 17 : చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డిపై బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రకటించిన అవిశ్వాసం ప్రక్రియ సద్దుమణిగింది. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్లు పచ్చిమడ్ల సతీశ్, చైర్‌పర్సన్ భర్త అంకుగారి శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్ జుబేదాఖతూన్ కుమారుడు బబ్లూ, కౌన్సిలర్ యాట కనకమ్మ భర్త యాదగిరి కలిసి పురపాలక సంఘం అభివృద్ధితో పాటు అవిశ్వాసం రద్దుపర్చే చర్యలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తనదైన శైలిలో చక్రం తిప్పి బీఆర్ఎస్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో రెండు సార్లు చర్చలు జరిపి అవిశ్వాసం వీగిపోయేందుకు కృతకృత్యుడు కావడంతో గులాబీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశాయి.

గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 5 వార్డులు,కాంగ్రెస్ 5 వార్డులు గెలుచుకోగా మరో రెండు వార్డుల్లో ఇండిపెండెంట్లు విజయం సాధించారు. ఇరువురు ఇండిపెండెంట్లు నిమ్మ రాజీవ్‌రెడ్డి, జుబేదాఖతూన్ అనంతరం జరిగిన పరిణామాలతో బీఆర్ఎస్‌లో చేరడంతో చేర్యాల మొదటి మున్సిపల్‌పై గులాబీ జెండా ఎగిరింది. అనంతరం జరిగిన కొన్ని పరిణామాలతో ఇతర పార్టీ వారితో కలిసి ఇటీవల అవిశ్వాసం రంగం సిద్ధం చేసి సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను కలిసి అవిశ్వాస పత్రం అందజేశారు. దీంతో ఈ నెల 19న అవిశ్వాస సమావేశం నిర్వహించేందుకు సంబంధితశాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, పార్టీ కౌన్సిలర్లతో మాట్లాడి అవిశ్వాసాన్ని కాస్తా విశ్వాసంగా మార్చారు.



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు

- కేసీఆర్ హయాంలోనే గ్రామాలకు మహర్దశ
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# కార్యకర్తలు అధైర్య పడొద్దు

దుబ్బాక, జనవరి 17: కేసీఆర్ హయాంలోనే గ్రామాలకు మహర్దశ వచ్చిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. దుబ్బాక, అక్బర్‌పేట మండలాల్లో బుధవారం ఆయన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి నూతన గ్రామ పంచాయతీ భవనాలు, పలు కమ్యూనిటీ భవనాలను ప్రారంభించారు. చౌదర్‌పల్లి దుబ్బరాజేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు లేదని అధైర్య పడొద్దని కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. తండాలు, గూడెం, మధిర గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి ఫలాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. పట్టణాలతో సమానంగా గ్రామాలను అభివృద్ధి చేసి, కుల వృత్తులకు ఆదరణ కల్పించారని గుర్తు చేశారు. నూతన గ్రామపంచాయతీల్లో సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, ఇంటింటికీ నల్లా నీరు, పల్లె ప్రకృతి వనం , వైకుంఠ ధామం ఇలా ఎన్నో రకాలుగా అభివృద్ధి చేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వ పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం క్రీడాకారులకు క్రికెట్ కిట్స్ , క్రీడా సామగ్రిని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, ఏఎంసీ చైర్‌పర్సన్ చింతల జ్యోతీకృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజమౌళి, భూంపల్లి మనోహర్, సోలిపేట సతీశ్‌రెడ్డి, సర్పంచ్‌లు మాలోతు పెంటవ్వ, మాదూరి శ్రీనివాస్, సోమారం స్వప్నాస్వామి, కుమార్, శేర్ల రచనాకైలాస్, నాయకులు కిషన్‌రెడ్డి, దేవరాజ్ పాల్గొన్నారు.



దుబ్బాక మండలం శిలాజీనగర్‌లో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పుష్పలత తదితరులు



వెంకటగిరితండాలో క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

## గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తిచేయాలి

- సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్
- హుస్నాబాద్‌లో గ్రంథాలయ భవన నిర్మాణ పనుల పరిశీలన

హుస్నాబాద్, జనవరి 17: హుస్నాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనం పనులు మార్చిలోగా పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ ఆదేశించారు. హుస్నాబాద్‌లోని ఎంపీడీవో కాంప్లెక్స్ ఆవరణలో రూ.50లక్షలతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం గ్రంథాలయం ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్నందున నిరుద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, త్వరగా భవన నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా నుంచే నిధులు సమకూర్చే అవకాశం ఉన్నందున పనులను వేగవంతం చేయాలని, ఎప్పటికప్పుడు బిల్లులు వచ్చేలా చూస్తామని గుత్తేదారుకు హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక గ్రంథపాలకుడితో మాట్లాడి నిత్యం గ్రంథాలయానికి ఎంత మంది వస్తారు, వారికి కావాల్సిన సౌకర్యాలేమిటనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. కొత్త గ్రంథాలయంలో సకల సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, సాంఘిక సంక్షేమశాఖ డీఈఈ మధుసూదన్, లైబ్రేరియన్ రాజు తదితర అధికారులు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో లైబ్రేరియన్‌తో గ్రంథాలయం వివరాలను అడిగి తెలుసుకుంటున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

# ట్రాఫిక్‌రూల్స్ పాటించాలి

- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి
- సైన్, రేడియం బోర్డులు ఏర్పాటు చేయాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- రోడ్డు సేఫ్టీ కమిటీ అధికారులతో సమీక్షా సమావేశం

మెదక్, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో బుధవారం రోడ్డు సేఫ్టీ కమిటీ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రత, హెల్మెట్‌పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సూచిక,సైన్, రేడియం బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మూలమలుపుల దగ్గర హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేసి రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి వేయాలన్నారు. స్పీడ్ బ్రేక్‌లు ఏర్పాటు చేసి మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు మరమ్మతుల్లో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. రోడ్డు భద్రత గురించి ప్రతి పౌరుడు తెలుసుకోవాలన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుందని, ప్రతి మూడు నిమిషాలకు ఒకరు చనిపోతున్నారని గుర్తుచేశారు. ఎక్కువ శాతం అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్టీసీ డీఎం సుధ, డీఎంహెచ్‌వో చందునాయక్, ఎక్సైజ్ జిల్లా అధికారి రజాక్, సిబ్బంది పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలపై నిఘా పెట్టాలి

మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాల రవాణాపై జిల్లా అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలల యువతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వివిధ పారిశ్రామిక ప్రాంతాల్లో పని చేస్తున్న వారిని పసిగట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, కిరాణం, మెడికల్ షాపులపై నిఘా పెంచాలని సూచించారు.గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో డీఈవో రాధా కిషన్, డీఐఈవో సత్యనారాయణ, ఎక్సైజ్ జిల్లా అధికారి రజాక్, జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా

# ఏసీబీకి చిక్కిన అధికారి

- ఇంటి నెంబర్ కోసం రూ.10వేలు డిమాండ్
- రూ.8వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆర్ఐ

సదాశివపేట, జనవరి 17 : సంగారెడ్డి జిల్లా సదాశివపేట బల్దియాలో అవినీతి అధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. బుధవారం ఇంటి నెంబర్ కోసం రూ.8వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని హౌసింగ్ బోర్డు ఈకోవాలి వెంచర్‌లో ఇంటినెంబర్ కేటాయించాలని ఆకుల సంగమేశ్వర్ డిసెంబర్ 25న ఆర్ఐ వెంకట్రావును కోరాడు. ఇంటికి సంబంధించిన పత్రాలు అందజేయాలని తెలపగా బాధితుడు సంబంధిత ధృవపత్రాలను సమర్పించాడు. అయినా ఇంటినెంబర్ కోసం రూ.10వేలు ఖర్చు అవుతుందని ఆర్ఐ డిమాండ్ చేశాడు. అందుకు బాధితుడు పత్రాలు అన్ని ఉండగా డబ్బులు ఎందుకు ఖర్చు అవుతుందని అధికారిని ప్రశ్నించాడు. అనంతరం కొన్ని రోజులపాటు ఆర్ఐ బాధితుడిని కార్యాలయం చుట్టూ తిప్పుకున్నాడు. దీంతో విసుగు చెందిన బాధితుడి కుమారుడు శివకుమార్ ఆర్ఐతో ఒప్పందం కుదుర్చుకొని, ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు మున్సిపల్ కార్యాలయంలో దాడులు నిర్వహించి రూ.8వేలు లంచం తీసుకుంటున్న ఆర్ఐ వెంకట్రావ్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వేణుగోపాల్‌శర్మలను పట్టుకున్నారు. ఈ మేరకు సెక్షన్ 7బీ, 12బీ కింద కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో సీఐ వెంకట్‌రాజుగౌడ్, ఇన్‌స్పెక్టర్ రమేశ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ సిద్దిపేట్ హైవేలలో ప్రముఖ కార్ల షోరూంల యందు పనిచేయుటకు ''సెక్యూరిటీ గార్డులు'' కావలెను. పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత మంచి జీతం ఇవ్వబడును. స్వామి: 9392143108, 9652520827. NT-313978

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073. NT-319415-All

**CHANGE OF NAME**

★ I, BANDI SHIVA CHARY, S/o. Bandi Chandramouli (Old Name), R/o. H.No.4-16/1, Chinnagundavelly (V), Siddipet Rural, Siddipet Dist., T.S. I Changed My Name as BANDI SHIVA TEJA, S/o. Bandi Chandramouli (New Name) for future purposes. NT-313770

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.